# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 28 మంగళవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 192

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కేస్లాపూర్‌లో నాగోబా జాతర సందడి

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు**

**10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న**




## మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి..

**కానీ కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం**

**కేంద్రం ఇచ్చే పథకాలకు ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు**

**ప్రజలను మాయచేస్తున్న రేవంత్‌రెడ్డి : బండిసంజయ్**




## సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు




రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనాలు

పథకాలపై నిలదీతలతో సమాధానాలు చెప్పలేకపోతున్నాం

రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది

వైరల్ అవుతున్న రాజగోపాల్‌రెడ్డి వీడియో




## కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు

గ్రామసభల్లో నిలదీసినా కప్పిపుచ్చుకునే యత్నం

హామీల అమలుకు ఏడాదైనా పూర్తి చేయని వైనం

మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

# కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది



**మోదీ సర్కార్‌కు వ్యాపారులే ముఖ్యం**

**జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో రాహుల్**

**ఇండోర్:** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుందని, వారికి అండగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలో ఉన్న తెలంగాణలో కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు, ఓబీసీలకు న్యాయం జరిగేలా పోరాడుతామని అన్నారు. సోమవారం ఇండోర్ లో నిర్వహించిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యమని విమర్శించారు. బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబి స్తోందని అన్నారు. స్వాతంత్రోద్యమాన్ని అవమానపర్చేలా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమిత్ షా సాక్షాత్తూ పార్లమెంటులోనే అంబేద్కర్ ను అవమాన పర్చారని అన్నారు. దేశంలో 90శాతం మందికి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కడం లేదని, జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని రాహుల్ గాంధీ చెప్పారు. రిజర్వేషన్లలో ముఖ్యంగా ఓబీసీలకు


మిగతా 2లో


## రాజ్యాంగ పరిరక్షణకు తామంతా పోరాడుతున్నాం


**రాహుల్ వెన్నంటి నడుస్తున్నాం**

**ఇండోర్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి**




ఇండోర్: రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇండోర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని గ్రహించే పోరాడుతున్నారని చెప్పారు. గజనీ మహమ్మద్ హిందుస్థాన్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పేరుతో కొనసాగుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ ల మధ్య సాగుతున్న యుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షిస్తుందని, రిజర్వేషన్లు కాపాడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీకి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ, అమిత్ షా రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

## ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్ వైఖరి మారుతోంది



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి మారుతోందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి నాలుగున్నర నెలలు గడిచినా.. ఇప్పటికీ వర్గీకరణ జరగలేదని ఆవేదన వ్యకం చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో మందకృష్ణతో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరుపై ఘాటుగా స్పందించారు. 'వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మొదటగా స్పందించిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి. వర్గీకరణ అమలులో తెలంగాణ మొదటి రాష్ట్రం అవుతుందని, గత నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేస్తామని చెప్పింది ఆయనే.కానీ మాట మార్చి నియామకాలు చేపడుతున్నారు.

# కుంభమేళాలో ఆ రోజు ఎంతో పవిత్రం



## 29న మౌని అమావాస్య

**ప్రయాగ్ రాజ్‌లో అమిత్‌షాకు ఘన స్వాగతం**

**స్వాగతం పలికిన సిఎం యోగి తదితరులు**


**కుంభమేళాలలో స్నానమాచరించిన అమిత్ షా**



న్యూఢిల్లీ: ఈసారి జరుగుతున్న మహాకుంభమేళా అత్యంత పవిత్రమైనది. 144 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే జరిగే అరుదైన ఖగోళ అమరిక ద్వారా వచ్చిన ఈ కుంభమేళా ఆధ్యాత్మికపరంగా ఎంతో విశిష్టమైనది. మహా కుంభమేళా సమయంలో అమృత స్నానానికి అత్యంత ప్రాముఖ్యతమైనది. కుంభమేళా పూర్తయ్యేలోగా 6 అమృత స్నానాలు ఉంటాయి. ప్రతి ఒక్కదానిని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ప్రత్యేకమైన రోజులలో రావడమే ఇందుకు కారణం. మకర సంక్రాంతి నాడు జరిగిన అమృత స్నాన్?తో సమానంగా మౌని అమావాస్య అమృత స్నాన్‌ను పరిగణిస్తారు. ఈ రోజున ఋషులు, సాధువులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అందుకే ఈ అమృత స్నాన్ సమయంలోనే నాగ సాధువులకు దీక్ష కూడా ఇస్తారు. అదే మౌని అమావాస్య


మిగతా 2లో


## 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో పిటిషన్



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ పథకం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టు లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ పిటిషన్ వేశారు. భూమి లేని రైతు కూలీలలకు ఏటా రూ. 12వేలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం రూపొందించిందని.. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 129 మున్సిపాలిటీల్లో 8లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకు ఇచ్చి మున్సిపాలిటీల్లోని వారికి ఇవ్వకపోవడం సరికాదన్నారు. రైతు కూలీలు ఎక్కడ ఉన్నా అందరూ సమానమేనని చెప్పారు. కేవలం గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకే ఈ పథకం వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. అనంతరం హైకోర్టు స్పందిస్తూ 4 వారాల్లో మున్సిపాలిటీల్లోని రైతు కూలీలను 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకంలోకి తీసుకోవాలని ఆదేశించింది.

వేగుచుక్క

# కుంభమేళాలో ఆ రోజు ఎంతో పవిత్రం

ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. మౌని అమావాస్య 2025 జనవరి 29న జరుపుకుంటారు. ఈ రోజునే మహాకుంభమేళాలో రెండవ అమృత స్నాన్ జరుగుతుంది. కుంభమేళా సమయంలో అమృత స్నానం ఆచరించడాన్ని అత్యంత పవిత్రమైనదిగా విశ్వసిస్తారు. మౌని అమావాస్య రోజుకు జరిగే అమృతస్నాన్‌కు మరింత ప్రాముఖ్యత ఉంది. అందువల్ల ఈ రోజున మహాకుంభ సమయంలో త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలతో స్నానం చేయడాన్ని అమృతతుల్యంగా భావిస్తారు. హిందూ పురాణాలు ప్రకారం మౌని అమావాస్య నాడు అమృత స్నానం చేయడాన్ని అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ రోజున నాగ సాధువులు దండి కింద దీక్షను స్వీకరిస్తారు. మౌని అమావాస్య రోజున చంద్రుడిని పూజించడం వల్ల జాతకం బలపడుతుందని నమ్ముతారు. ఈ ప్రత్యేక సందర్భంలో పితృ పూజ చేసి పూర్వీకులను గౌరవిస్తే వారి ఆశీర్వాదాలు దక్కి కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. శివుని ఆరాధనకు, తాంత్రిక అభ్యాసాలు, మంత్ర సాధన, మంత్రాలను పఠించడానికి అత్యంత పవిత్రమైన రోజు ఇదే.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 14 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. కుంభమేళా ప్రారంభైన జనవరి 13వ తేదీ నుంచి ఈనెల 26వ తేదీ వరకూ త్రివేణీ సంగమంలో 13.21 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడించింది. అందులో 10 లక్షల మంది కల్పవాసీలు కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇక ఇవాళ ఉదయం 8 గంటల వరకూ దాదాపుగా 46.64 లక్షల మంది స్నానాలు ఆచరించినట్లు



అధికారులు తెలిపారు. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం.

**ప్రయాగ్ రాజ్‌లో అమిత్‌షాకు ఘన స్వాగతం**

**స్వాగతం పలికిన సిఎం యోగి తదితరులు**

**కుంభమేళాలలో స్నానమాచరించిన అమిత్ షా**

**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్‌దేవ్ కూడా పుణ్యస్నానమాచరించారు. పుణ్యస్నానం కోసం ప్రత్యేక విమానంలో ప్రయాగ్‌రాజ్ చేరుకున్న అమిత్ షాకు సిఎంయోగి ఆదిత్యనాథ్, ఆయన మంత్రిర్గ సహచరులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక బిజెపి నేతలు కూడా అమిత్ షాను స్వాగతించారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది.

విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు.

ఈనెల 29న మౌని అమావాస్య కావడంతో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు(అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వల్ల 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించిందని అంచనా. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడికల్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

## కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు



**నిజామాబాద్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును ప్రజలు అనేకచోట్ల నిలదీసారని, ప్రజలకు సమాధానం చెప్పే స్థితిలో పాలకులు లేరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. కేవలం స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం చేస్తున్న కసరత్తు తప్ప ప్రజల మేలుకోరి చేసే పనులు మాత్రం కావన్నారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడు తున్నారని తెలిసి కూడా బుకాయించారని అన్నారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమని వేముల పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడిగారని అన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. అబద్దాలు చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలు తిరగబడ్డా రని వేముల అన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పుట్టి పెరిగిన గ్రామాల్లో ఎన్నికల హామీలు నూరు శాతం అమలు జరిగాయని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాల నుం చి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. హామీల అమలులో ప్రజలకు సర్కారు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను మండలానికి ఒక గ్రామం చొప్పున, జిల్లాలోని 35 మండలాల్లో కేవలం 35 గ్రామాల్లో ప్రారంభించారని తెలిపారు. ఏ ఊరికైనా వెళ్లి, నూరుశాతం హామీలు అమలవుతున్నాయని ప్రజలు చెబితే రాజకీయాలను వదిలేస్తానని, లేకుంటే కాంగ్రెస్ నాయకులు, రాజకీయాలు వదిలేసి ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలవి తుగ్లక్ రాజకీయాలని ఆయ న విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల వీరంగాలు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడే రకం కాదన్నారు. తాము పోరాడుతూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని, అందుకే ఎక్కడ చూసినా జనాగ్రహజ్వాలలే కనిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలన అని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే రోజుకో నాటకం వేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు సంక్రాంతి పోయిందని, ఇప్పుడు శివరాత్రికి అంటున్నారని ఎద్దేవా చేశారు.

## సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

మునుగోడు: కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ ప్రభుత్వంపై అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు బంధును ఎగ్గొట్టామని, రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా కొంత నగదు తగ్గించామని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు) ప్రారంభోత్సవంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 'తమకు రైతు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాన్ని తిరుడున్నారు. అంతా కేసీఆర్ పాలనే బాగుండేదని మెచ్చుకుంటున్నారు' అని అన్నారు. 'రైతుబంధును మధ్యలో ఒకసారి ఎగ్గొట్టినం. రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా, కొంత నగదును తగ్గించినం. అందుకే గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. అదే రూ.2 లక్షల రుణ మాఫీ అయినోల్లు మాత్రం జేబులో వేసుకొని సప్పుడు చేస్తలేరు. ఎన్ని అప్పులు చేసైనా పథకాలు అమలు చేస్తాం' అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సొంత పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్? ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్:** తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్ట్‌లు, దర్యాప్తులు, విచారణల తర్వాత– ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

## మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి..

**హైదరాబాద్:** మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు. పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

## కేస్లాపూర్‌లో నాగోబా జాతర సందడి

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేస్తాపూర్‌లో నాగోబా జాతర సందడి నెలకొంది. ఏటా నిర్వహించే ఈ జాతరకు వేలాదిగా గిరిజనులు తరలివస్తారు. జాతరకు పొరుగున ఉన్న మహారాష్ట్రతో సహా సుదూర ప్రాంతాల నుండి ఉన్నతాధికారులు, ఆదివాసీ మెస్రం వంశీయులు, తదితర భక్తులు ఈ జాతరకు తరలివస్తారు. ఈ నెల 28న రాత్రి మహాపూజ, 31న ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పక్కగా ఏర్పాట్లు చేసింది. జాతర ఏర్పాట్లపై అధికారులు పనులు పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా నాగోబా జాతరకు సంబంధించిన పరిసర ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. మర్రిచెట్టు ప్రాంతం, కోనేరు, గోవాడ్, తై బజార్, స్టాల్స్, దేవాలయ ప్రాంతం, తదితర ప్రాంతాలలో చేపడుతున్న పనులను పరిశీలించి, పనులను

వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లు, చేపట్టవలసిన పనుల వివరాలను వివిధ శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. నాగోబా జాతర ఏర్పాట్లపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఎండోమెంట్ అధికారులు,ఇతర జిల్లా ఉన్నతాధికారులతో ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమైన శాఖలకు సంబంధించిన విధులను షిఫ్ట్ ల వారిగా కేటాయించడం జరిగిందనీ, వారం రోజుల పాటు జరిగే నాగోబా జాతరలో సంబంధిత అధికారులు విధులు నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని, ప్రశాంతంగా దైవదర్శనం చేసుకొని, తిరుగు ప్రయాణం చేసేంతవరకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

సమీక్షలలో అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద మహ జాతర నాగోబా జాతర అని, ఈ జాతరను అందరి సమన్వయంతో విజయవంతం చేయాలనీ అన్నారు. ముఖ్యంగా జాతరకు సంబంధించి ప్రతి బస్ కు నాగోబా జాతర నిర్వహించు స్టిక్కర్లను అతికించాలని, నాగోబా జాతర అన్ని జిల్లాలకు తెలిసేలా అన్ని బస్టాండ్ లలో, ఖీఅ బస్ లకు స్టిక్కర్లు వేయాలని తెలిపారు. ముఖ్యంగా జాతర లో హోటల్స్, తినుబండారాలు, తదితర వ్యాపారులు కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ సందర్భంగా ఆహారం కలుషితం కాకుండా, నిలువ ఉంచకుండా ఎప్పటికప్పుడు ఏరోజుకారోజు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆహారభద్రతా కమిటి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు.నాగోబా జాతరకు సంబంధించి అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని, బారికేడ్లు, పోలీస్ బందోబస్తు, పోలీస్ క్యాంప్ ను ప్రతి ఏడాది లాగే ఏర్పాటు చేయడం జరుగుతుందని, జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా అన్నిచోట్ల ప్రత్యేక పోలీసు బందోబస్తును తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. వారం రోజుల పాటు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పూర్తి సహకారం

**విజయవాడ:** పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రూట్ మ్యాప్ ప్రకారం ప్రాజెక్టు పనులు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ఎడమ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి ఆ ప్రాంతం రుణం తీర్చుకుంటామన్నారు. 'రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉంటే ఎంత మేలు జరుగుతుందో ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోంది. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పోలవరంతో పాటు.. ప్రకాశం జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం అంతా

ఇంతా కాదు. 2025లో చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని నిమ్మల రామానాయుడు తెలిపారు. గత ఐదేళ్లల్లో విధ్వంసకరమైన పాలన సాగిందని.. ఇరిగేషన్ శాఖలో అనేక కీలక ప్రాజెక్టుల పనులు నిలిపివేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.నీరు అందక రైతులు కన్నీరు పెట్టినా జగన్ ప్రభుత్వం కనికరం చూపలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం ఆధ్వర్యంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు చేపట్టామని తెలిపారు. పోలవరం నిర్మాణ పనులు మొత్తం ఆపివేస్తే.. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ ఊపిరి పోశారన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్‌ను ఇటీవల చంద్రబాబు సందర్శించారని.. ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీరు ఇవ్వాలని చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకున్నా కొంతవరకైనా నీరు ఇచ్చేలా పనులు చేస్తున్నారన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులు పూర్తి చేసి 2025 జులైకు ఉత్తరాంధ్రకు నీరు ఇవ్వనున్నారని తెలిపారు. రూ.1050 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు అన్ని అనుమతులు ఇప్పించారన్నారు. బాటిల్ నెక్‌పై సమీక్ష చేసి పురుషోత్తం పట్నం మీదుగా ఉత్తరాంధ్రకు నీరు ఇస్తామని.. దీనిపై అధికారులతో సమీక్ష చేసి పలు సూచనలు చేశామన్నారు. గత వైసీపీ పాలనలో పార మట్టి, కట్ట సిమెంట్ కూడా వేయలేదని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అన్ని విధాలా అన్యాయం చేసిన ఘనుడు జగన్‌మోహన్ రెడ్డి అంటూ విరుచుకుపడ్డారు. నిర్ణీత టైం బాండ్ పెట్టుకుని మరీ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇంకా పోలవరం గురించి వైసీపీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు సారథ్యంలో డయా ఫ్రం వాల్ నిర్మాణం చేస్తే.. జగన్ జమానాలో అదే డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేశారన్నారు. అసెంబ్లీలో పోలవరం ప్రాజెక్టు గురించి అడిగితే వైసీపీ నేతలు చెప్పకుండా పారిపోయారని వ్యాఖ్యలు చేశారు. జగన్ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. కుర్చీ కోసం జగన్ రాజకీయ డ్రామాలు ఆడారన్నారు. 2019–24 మధ్య ఎన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మాణం చేశారని ప్రశ్నించారు. పోలవరం రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్‌లో నీరు ఉంటేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఏపీ చరిత్రలో సీఎంగా జగన్ చేసినంత దగా ఎవరూ చేయలేదన్నారు. ఈ యేడాది డిసెంబరు నాటికి డయా ఫ్రం వాల్ పూర్తి చేస్తామని వెల్లడించారు. 2027 చివరి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు సాగు, తాగు నీరు ఇస్తామన్నారు. చింతలపూడి ప్రాజెక్టును కూడా అటకెక్కించారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల, నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందన్నారు. ఇప్పుడు ఉన్న అడ్డంకులను అధిగమించి పనులు పూర్తి చేస్తామన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేస్తున్నామని చెప్పారు. కృష్ణా, గోదావరి నదులకు ద్రోహం, దగా చేసిన వ్యక్తి జగన్ అంటూ విరుచుకుపడ్డారు. విభజన చట్టం ప్రకారం మనకు నీరు, ప్రాజెక్టుల వాడకంపై ఒప్పందం జరిగిందని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేంద్రం నుంచి వచ్చిన సూచనలను పట్టించుకోలేదన్నారు. జగన్ తన కేసుల కోసం తెలుగు ప్రజలు భవిష్యత్తును తాకట్టు పెట్టారన్నారు. ప్రజల హక్కులను హరించే విధంగా జగన్ వ్యవహరించారని అన్నారు. విభజన చట్టం ప్రకారం నిధులు, నియామకాలు ఉన్నా జగన్ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో తప్పకుండా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. 14 లక్షల కోట్లు అప్పులు పెట్టి గత పాలకులు వెళ్లారని.. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెడతామన్నారు. అన్నీ పూర్తి చేయాలని ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వానికి ఉన్నాయని తెలిపారు. 2014–2019 మధ్య అభివృద్ధికి నిధులు సీఎం చంద్రబాబు వెంటనే ఇచ్చేవారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ఇప్పుడు ఆచితూచి చంద్రబాబు నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. ఐదు సంవత్సరాల్లో జరిగిన విధ్వంసాన్ని సరిచేయడానికి కొంత సమయం పడుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది



అన్యాయం జరుగుతోందని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని విద్యా వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ప్రజలను లూటీ చేస్తోందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా భాజపా , ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో స్వాతంత్ర్యం పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి బానిసలుగా మారుస్తున్నారని ఆరోపణలు చేశారు. 'ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. దేశంలో స్వాతంత్య్రానికి పూర్వం నాటి పరిస్థితులను భాజపా, ఆర్ఎస్ఎస్ మళ్లీ కోరుకుంటున్నాయి. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, పేదలను మరోసారి బానిసలుగా మారుస్తున్నాయి. రాజ్యాంగం మారిన రోజు ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు ఉండవు' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాహుల్ దేశ విద్యా వ్యవస్థ గురించి ప్రస్తావించారు. 'ప్రైవేటు వ్యవస్థలో విద్య, వైద్య రంగాల యాజమాన్యం ఎవరి చేతిలో ఉంది..? మన భారత విద్యా రంగం స్టాంపులు, సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది. సర్టిఫికేట్లు వస్తే.. ఉద్యోగాలు వస్తాయని కోట్లాది మంది ప్రజలు భావిస్తున్నారు. ఇదంతా పచ్చి అబద్ధం. అలా చేస్తే మీ పిల్లలు దేశంలో ఎలాంటి ఉపాధి పొందలేరు. ఈ బిలియనీర్లు దేశ ఉపాధి వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ఆర్ఎస్ఎస్ నేతలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. 'ప్రస్తుతం హస్తం పార్టీని తప్పుపడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు స్వాతంత్య్రం కోసం ఎటువంటి పోరాటం కూడా చేయలేదు. పేదరికం, నిరుద్యోగం నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు.

- డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ.



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జనవరి 27:**

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో
గర్భస్తపూర్వ గర్భస్థ పిండా లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశము సోమవారం డిఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ అధ్యక్షతన డిఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిని మాట్లాడుతూ, జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా ఏ స్కానింగ్ కేంద్రంలో అయినా గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసిన తర్వాత పుట్టబోయే శిశువు ఆడ లేదా మగా అని తెలియజేస్తే పిసిపిఎన్డిటి చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోబడును. ఆర్ఎంపి ,పిఎంపీలు రిఫర్ చేసిన ప్రిస్క్రిప్షన్స్ ని ఏ స్కానింగ్ సెంటర్ వైద్యులు కూడా సమ్మతించి స్కానింగ్ చేయరాదని, ఆర్.ఎం.పి పిఎంపీలు వారి నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ప్రథమ చికిత్స కేంద్రాలుగా కొనసాగించాలన్నారు. మెడికల్ షాపుల్లో అబార్షన్ కొరకు వాడే ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ రిఫరల్ స్లిప్పు లేనిదే అమ్మ రాదని తెలియజేశారు. జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలన్నీ రికార్డులను, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, లేనిచో వారికి రిజిస్ట్రేషన్ కానీ, రినెవల్స్ కానీ చేయడం జరగదు అన్నారు. అదేవిధంగా జిల్లాలో విస్తృతంగా అవగాహన సదస్సులను పిసిపి ఎన్డిటి చట్టంపై , బ్రూన హత్యలపై, ఆడపిల్ల ప్రాధాన్యతపై, బేటి బచావో బేటి పడాఓ పై, పాఠశాలల్లో, కళాశాలల్లో, గ్రామ మరియు మండల స్థాయి సమాఖ్య సమావేశాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగే అమ్మ ఒడి కార్యక్రమాల్లో, నెలవారి సమావేశాల్లో, ఆశాలు గృహ సందర్శనలో ,ఐకెపి, మెప్మా , డిఆర్డిఏ నెలవారి సమావేశాలలో వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలో మొత్తం ఆరు టీం ల ద్వారా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను
ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నూతనంగా స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం ఒక దరఖాస్తు, స్కానింగ్ సెంటర్ రెన్యువల్ కోసం ఏడు దరఖాస్తులు రావడం జరిగింది అన్నారు. ఇంకా ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ దీప్తి, పిల్లల వైద్యులు డాక్టర్ హరిప్రియ, గైనకాలజిస్ట్ డాక్టర్ కీర్తి ప్రియ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అంజన, డాక్టర్ సమత, డాక్టర్ రాకేష్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుప్రియ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధా, మహిళఎన్జీవో పద్మాసింగ్, ఆరోగ్య చైతన్య వేదిక నుండి ఘన్పూర్ వెంకటేశ్వర్లు, మెప్మా నుండి మాధురి, మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి సౌమ్య, డెమో నాగలక్ష్మి , డిహెచ్ఈ జి. వేణుగోపాల్, దేవేందర్ హాజరయ్యారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా నాయకుడి అరెస్టు.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జనవరి 27**



నగరంలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా నాయకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని పర్భనికి చెందిన కరణ్‌సింగ్ మరో ముగ్గురితో కలిసి దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. దీంతో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి ముఠా సూత్రధారిని పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా లాథూర్‌కు చెందిన కరణ్‌సింగ్ బావూరీ, అజయ్‌సింగ్, జాల్నాకు మనోహర్ సింగ్‌తో కలిసి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి ఒక బైక్, చోరీకి ఉపయోగించిన సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన ముగ్గురు నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన బృందాన్ని అభినందించారు.

# లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత.



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జనవరి 27**

అర్బన్‌ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త సోమవారం క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎం సహాయ నిది ధ్వారా 103మందికి 29,64,524 రూపాల విలువ గల చెక్కులు అందించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎక్కువ మొత్తం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అర్బన్ నియోజకవర్గనికి రావడం జరిగిందని అన్నారు. ఎటువంటి జాప్యం లేకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సెక్రటరేట్ కి పంపించడం జరుగుతుందని అన్నారు..రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అప్లై చేసుకున్న మొత్తంలో 15, 20 శాతం మాత్రమే చెల్లిస్తుందని లక్షల్లో ఖర్చు ఉంటే 15వేలు, 20వేలు ఇస్తే సామాన్యులకు చికిత్స ఖర్చు ఆర్థిక భారంగా మారుతుందని అన్నారు..
రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సీఎంఆర్‌ఎఫ్ అప్లై చేసుకున్న మొత్తంలో 50% ప్రభుత్వం చెల్లించేలే డిమాండ్ చేస్తానని తెలియజేసారు. గత ఎమ్మెల్యే హయాంలో సంవత్సరాలు గసిన చెక్కులు రాలేదని ఇప్పుడు అప్లై చేసుకున్న 3 నెలలో చెక్కులు వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే గారికి లబ్ధిదారులు అందరు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు,మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 27**




గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ, నిరంతరం నిఘాను కొనసాగించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ హాజరై, జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి పోలీస్, ఎక్సయిజ్, ఔషధ నియంత్రణ మండలి అధికారులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. నిజామాబాద్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుండి నిజామాబాద్ మీదుగా గంజాయిని అడపాదడపా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులతో సమన్వయము పెంపొందించుకుని నిరోధక చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి విక్రేతలను, దానిని వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా కోర్టులకు సమగ్ర ఆధారాలు సమర్పించాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను వెలికితీయాలని, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరిస్తూ విస్తృతస్థాయిలో
అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి అలవాటుపడకుండా ఉండేందుకు వీలుగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని ఆ వ్యసనం మానుకునేలా జిల్లా కేంద్రంలో డీ-అడిక్షన్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు కలెక్టర్ తన ఛాంబర్లో డి.అడిక్షన్ సెంటర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో పాటు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్ తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ కేంద్రం ఏర్పాటు దిశగా తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డి, ఎక్సయిజ్ ఎన్ఫోర్స్ మెంట్ సహాయ సూపరింటెండెంట్ డీసీబీ.నాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, పోలీస్, ఎక్సయిజ్, రవాణా, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం.**
**పాల్గొన్న ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ.**
**డీ.అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం.**

# ఎంఆర్‌ఆర్ నిధులు రూ. 4.32 కోట్లు విడుదల.

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 27:**



నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు ఎంఆర్‌ఆర్ నిధులు రూ. 4.32 కోట్లు మంజూరయ్యాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి, క్యాసంపల్లి తండా మార్గానికి రూ. 76 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు అడ్లూర్ హరిజనవాడ మార్గానికి రూ. 1.33 కోట్లు, రాజంపేట పెద్దాయిపల్లి రోడ్డుకు రూ.1.25 కోట్లు, 44వ నంబర్ జాతీయ రహదారి టేక్రియాల్ దారికి రూ. 30 లక్షలు, భిక్కనూరు మండలం జడ్పీ రోడ్డు సిద్ధరామేశ్వర స్వామి ఆలయం మార్గానికి రూ. 70 లక్షలు మంజూరైనట్లు వివరించారు.

# దాంపత్య జీవనానికి శివపార్వతులె ఆదర్శం.

- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 27:**

దాంపత్య జీవనానికి శివపార్వతులె ఆదర్శం అని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. ఇందూర్ భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో వినాయక నగర్ లోని, బస్వ గార్డెన్లో గత ఏడు రోజులుగా బ్రహ్మ శ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ శివపురాణ ప్రవచనము నిర్వహించడం జరుగుతుంది. చివరి రోజైన సోమవారం శివపార్వాతుల కళ్యాణనికి వేల సంఖ్యలో హాజరైన భక్తుల నడుమ అంగరంగ వైభోవంగా కల్యాణమహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరై ప్రత్యేక పూజ, కళ్యాణం, హారతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, హిందూ ధర్మంలో జరిగే పెళ్ళి, కన్యధానం, దాంపత్యం యొక్క గొప్పతనం వల్లే ప్రచాత్య దేశాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి అన్నారు. ఆదర్శ దంపతులైన శివపార్వతులు దాంపత్యం జీవనం సాగించే అందరికి ఆదర్శం అన్నారు, మహాశివుడు పార్వతి దేవిని గౌరవించి అర్ధ శరీరభాగాన్ని ఇచ్చి అర్ధనారీశ్వరుడిగా మారి సమస్త మానవాళికి స్త్రీగా భార్యను ఎలా గౌరవించలో గొప్ప సందేశాన్ని ఇచ్చారన్నారు. సనాతన ధర్మ రక్షణకు కంకణ బద్దులై హిందూ జాతిని జాగృతం చేయడంలో ఇందూర్ భక్త బృందం వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు.అనంతరం భక్తులకు నిర్వహించిన మహా అన్నదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆగమయ్య గురుస్వామి, చెన్న గంగరత్నం, పార్శి రాజు, ఎంసాని రవి, లభిశెట్టి శ్రీనివాస్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 27**

నిజామాబాద్ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలక వర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్ ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,
ఇతర అధికారులు కలెక్టర్ కు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలియజేశారు.

# రాజకీయంగా వైరుధ్యంతో పార్టీలో అసంతృప్తి

## జాడ లేని మార్కెట్ కమిటీల నియామకం

**జగిత్యాల:** నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో పనులు సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి. ఎమ్మెల్యే సంజయ్‌కు పొసగకపోవడంతో పార్టీలో ఏకాభిప్రయం కానరావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏడాది గడిచినా జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టు భర్తీకాకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇష్టారాజ్యంగా పాలన సాగుతుండడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రెండు మార్కెట్ కమిటీలు ఉండగా, రెండింటికి పాలకవర్గాలను ఇంత వరకు నియమించలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయాలన్నీ తారుమారు అయిపోయాయి. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు, పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ఏడాది క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మరికొందరి పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో చిక్కుల్లో పడ్డ అధికారులు ఎవరినీ ఎంపిక
చేయకుండా వదిలిపెట్టారు. వడ్ల కొనుగోలుకు సంబంధించి రెండు సీజన్లు పూర్తయి, మూడో సీజన్ ప్రారంభమైనా ఇంకా కమిటీల ఏర్పాటు జరగకపోవడంపై రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంపిక విషయంలోనూ తీవ్రమైన జాప్యం నెలకొన్నది. జిల్లాస్థాయి పోస్టు కావడంతో మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవిని ఆశిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ పోస్టు కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ ప్రయత్నించారు. అలాగే, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు సైతం అదే పదవిని ఆశిస్తూ వచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దళిత వర్గానికి చెందిన సీనియర్ కార్యకర్తకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, సదరు దళిత నాయకుడికి పదవి ఇవ్వడం ఇష్టంలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మరో నాయకుడి పేరును ప్రతిపాదిస్తూ సిఫారస్ చేశారు. దీంతో చైర్మన్ ఎంపికలోనూ ప్రతిష్టంభన ఏర్పడింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి భర్తీ విషయంలో చక్రం తిప్పిన జగిత్యాల ఎమ్మెల్యే తన రాజకీయ ప్రత్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని విజయవంతంగా అడ్డుకున్నట్లు
తెలుస్తోంది. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జితో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని, చొప్పదండి ఎమ్మెల్యే, ధర్మపురి ఎమ్మెల్యేను ఒప్పించి, ఎమ్మెల్యే ప్రతిపాదించిన దళిత వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా, తన సామాజిక వర్గమైన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడి పేరును ప్రతిపాదించినట్లుగా సమాచారం.

వేగుచుక్క





# గాంధీ తాత చెట్టు టీంతో...


రామ్ చరణ్ ప్రస్తుతం గేమ్ ఛేంజర్ నుంచి బయటకు వచ్చాడు. బుచ్చిబాబు ప్రాజెక్ట్ మీద ఫోకస్ పెట్టాడు. గత కొన్ని రోజులుగా రామ్ చరణ్ గుబురు గడ్డంతో కనిపిస్తున్నాడు. ఈ సారి బుచ్చిబాబు ఏం ప్లాన్ చేశాడో గానీ రామ్ చరణ్ లుక్స్, బాడీ మీద ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. %=జ% 16 మూవీపై ఇప్పటికే అంచనాలు ఆకాశన్నంటేస్తున్నాయి. తాజాగా గాంధీ తాత చెట్టు టీంని అభినందించిన రామ్ చరణ్ ఫోటోలు బయటకు వచ్చాయి. ఇందులో రామ్ చరణ్ రగ్డ్ లుక్ చూసి అంతా ఫిదా అవుతున్నారు.

రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు ప్రాజెక్ట్ కోసం రెడీగా ఉన్నాడు. ఆల్రెడీ షూటింగ్ చకచకా జరుగుతోంది. ఇది వరకు జరిగిన షెడ్యూల్‌లో రామ్ చరణ్ సందడి చేశాడు. ఇప్పుడు బుచ్చిబాబు హీరో లేని సీన్లను షూట్ చేస్తున్నట్టుగా సమాచారం. ఇక నెక్ట్స్ వీక్ నుంచి రామ్ చరణ్ కూడా సెట్స్ మీదకు వెళ్లనున్నాడని సమాచారం. క్రికెట్ సీన్లను షూట్ చేస్తున్నారని నెట్టింట్లో టాక్ వినిపిస్తోంది. క్రికెట్ ఆడుతూ సిగరెట్ కాల్చే షాట్స్ అదిరిపోయాయ్ అని నెట్టింట్లో ఫ్యాన్స్ అయితే సందడి చేస్తున్నారు.

బుచ్చిబాబు ఏ స్టోరీ తీస్తున్నాడు.. ఏం చేస్తున్నాడు అన్నది ఎవ్వరికీ క్లారిటీ అయితే రావడం లేదు. ఒకప్పుడు కబడ్డీ అన్నారు.. మధ్యలో కుస్తీ అంటున్నారు.. ఇప్పుడేంట్రా క్రికెట్ అంటున్నారు అని నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఇక సినిమా కథ ఏంటో ఇంకా ఎవ్వరికీ అర్థం కావడం లేదు. బుచ్చిబాబు మాత్రం పాన్ ఇండియాను మించేలా స్టోరీని రెడీ చేశాడని ఇండస్ట్రీలో టాక్స్ వినిపిస్తున్నాయి. ఇక ఈ చిత్రాన్ని ఇదే ఏడాదిలో రిలీజ్ చేయాలని పట్టుబట్టి షూటింగ్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

తాజాగా రామ్ చరణ్, ఉపాసన వద్దకు గాంధీ తాత చెట్టు టీం వచ్చింది. రామ్ చరణ్ ఇంటికి వెళ్లిన ఈ టీం ఫోటోలు ఇప్పుడు బయటకు వచ్చాయి. సుకుమార్ కూతురు సుకృతి ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీపై సెలెబ్రిటీలు ప్రశంసలు కురిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ టీం అంతా కలిసి రామ్ చరణ్, ఉపాసన వద్దకు వెళ్లారు. వారితో కాసేపు ముచ్చట్లు పెట్టారు. ఇక రామ్ చరణ్ స్పెషల్‌గా సుకృతి పర్ఫామెన్స్ గురించి మాట్లాడుతూ పొగిడేసినట్టుగా తెలుస్తోంది. గాంధీ తాత చెట్టు టీంతో రామ్ చరణ్ ఇలా ముచ్చట్లు పెట్టిన ఫోటోలను ఫ్యాన్స్ చూసి ఫిదా అవుతున్నారు. రామ్ చరణ్ రగ్డ్ లుక్ చూసి అంతా అవాక్కవుతున్నారు. ఈ లుక్‌తో బాక్సాఫీస్ రికార్డుల్ని తిరగరాసేలా ఉన్నాడే అని అంతా అనుకుంటున్నారు. అభిమానులకు గేమ్ ఛేంజర్ చేసిన గాయాన్ని బుచ్చిబాబు సినిమాతో కవర్ చేసేందుకు రామ్ చరణ్ మరింతగా కష్టపడబోతోన్నాడనిపిస్తోంది.


# మహేష్ బాబుని బంధించిన రాజమౌళి..






మహేష్ బాబు రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించిన అప్డేట్ ఇంత వరకు రాలేదని ఫ్యాన్స్ హర్ట్ అయిన సంగతి తెలిసిందే. ఆర్ఆర్ఆర్ వచ్చి రెండేళ్లు దాటింది. మహేష్ బాబు లుక్ కూడా మార్చుకుంటూ ఉంటున్నాడు. లుక్ ఎలా ఉంటుందో ఓ ఐడియా వచ్చింది కానీ షూటింగ్ ఎప్పుడు ఉంటుందో ఎవ్వరికీ అంతు చిక్కలేదు. దీంతో రాజమౌళి, మహేష్ బాబులపై మామూలుగానే సోషల్ మీడియాలో మీమ్స్ లెక్కలేనంతగా వచ్చాయి. తాజాగా రాజమౌళి వదిలిన వీడియో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ఇండియాలో ప్రస్తుతం మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్టుల్లో మహేష్ బాబు రాజమౌళి సినిమా కచ్చితంగా ఉంటుంది. ఇక తెలుగులో అయితే ఇదే నెంబర్ వన్ ప్లేస్‌లో ఉంటుంది. ఇక ఈ మూవీ ఎప్పుడు స్టార్ట్ అవుతుందో ఎవ్వరికీ అంతు చిక్కలేదు. అటు రాజమౌళి ప్రీ ప్రొడక్షన్ పనులు అంటూ రెండేళ్లుగా సైలెంట్‌గానే ఉన్నాడు. మహేష్ బాబు జుట్టు పెంచుకుని దేశవిదేశాలు తిరుగుతూ ఉన్నాడు. ఇక అప్డేట్లు రావేమో అని ఫ్యాన్స్ తెగ ఆందోళన చెందారు. ఈ క్రమంలో మహేష్ బాబు వెకేషన్ల మీద వెకేషన్లు వేస్తుండటం.. సినిమా అప్డేట్ ఇవ్వకపోవడంతో ఫ్యాన్స్ కాస్త హర్ట్ అయ్యారు. ముందు మహేష్ బాబు పాస్ పోర్టుని లాక్కోండి సర్ అంటూ రాజమౌళికి రిక్వెస్టులు పెట్టినట్టుగా లెక్కలేనన్ని మీమ్స్ వచ్చాయి. ఇక ఇప్పుడు నిజంగానే రాజమౌళి ఆ పని చేశాడు. మహేష్ బాబు పాస్ పోర్టుని సీజ్ చేసేశాడు. సింహాన్ని ఇక బంధించేస్తున్నా అన్నట్టుగా ఓ శాడిస్టిక్ ఎక్స్ ప్రెషన్ ఇస్తూ ఓ వీడియోని రిలీజ్ చేశాడు. ఈ చర్యపై మహేష్ బాబు కూడా స్పందించాడు. ఒక్క సారి కమిట్ అయితే నా మాట నేనే వినను అని రిప్లై ఇచ్చాడు. ప్రియాంక చోప్రా కూడా ఇక హమ్మయ్య.. అన్నట్టుగా ఫైనల్లీ అని కామెంట్ చేసింది. ఇలా మహేష్ బాబు పాస్ పోర్టుని సీజ్ చేయడంతో సోషల్ మీడియా మొత్తం స్పందిస్తోంది. ఫన్నీ మీమ్స్, ట్రోల్స్‌తో మహేష్ బాబు రాజమౌళి మీద రకరకాల ఎడిటింగ్స్ చేస్తున్నారు. ఈ మీమ్స్ చూస్తుంటే అందరికీ పొట్ట చెక్కలయ్యేలా ఉంది. డార్లింగ్ సినిమాలోని సీన్, ఒక్కడు సినిమాలోని సీన్‌ను రీ క్రియేట్ చేసి అందులో మహేష్ బాబు, రాజమౌళిని పెట్టేస్తున్నారు. మేం ఏదో కామెడీగా పాస్ పోర్ట్ సీజ్ చేయండని అన్నాం సర్.. మీరు ఇలా నిజంగానే చేస్తారని అనుకోలేదంటూ నెటిజన్లు, మీమర్లు కామెంట్లు పెడుతున్నారు.



అంటే ఇక పాస్ పోర్ట్ ఇవ్వరా? అని మహేష్ బాబు అడగడం.. ఇచ్చేదేలే అన్నట్టుగా రాజమౌళి స్పందించడం ఆ మీమ్స్‌లో కనిపిస్తోంది. ఇక చేసేదేం లేక మహేష్ బాబు ఇతర మార్గాల్ని అన్వేషిస్తున్నాడట. పాస్ పోర్ట్ అవసరం లేని డెస్టినేషన్ల గురించి గూగుల్లో వెతుకున్నాతున్నాడంటూ ఫన్నీగా మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా మొత్తం మహేష్ బాబు, రాజమౌళి హంగామానే నడుస్తోంది. చూస్తుంటే ఈ నెల నుంచే రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అయ్యేలా ఉంది. ప్రియాంక చోప్రా కూడా హైదరాబాద్‌లోనే ఉంది. రాజమౌళి స్పీడు చూస్తుంటే మూవీని చాలా త్వరగానే ఫినిష్ చేసేలా ఉన్నాడు. ముందుగానే ప్రీ ప్లాన్డ్‌గా ప్రీ ప్రొడక్షన్ పనుల్ని కూడా ఫినిష్ చేశాడని సమాచారం.

# తక్కువ చేసి చూపించారు..




షాహిద్ కపూర్ కెరీర్ కబీర్ సింగ్ తరువాత పూర్తిగా మారిన సంగతి తెలిసిందే. అప్పటి వరకు ఎన్ని సినిమాలు చేసినా, ఎంత మంచి విజయాలు దక్కినా క్రెడిట్స్ మాత్రం వచ్చేవి కావు. కబీర్ సింగ్‌తో నార్త్ మొత్తం షాహిద్ కపూర్ జపం చేసేశారు. ఇక ఫర్జీ వెబ్ సిరీస్ కూడా బాగానే క్లిక్ అయింది. ఇప్పుడు దేవా అంటూ షాహిద్ కపూర్ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు.

షాహిద్ కపూర్ ప్రస్తుతం దేవా అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో షాహిద్ కపూర్ కనిపించబోతోన్నాడు. జనవరి 31న ఈ చిత్రం థియేటర్లోకి రాబోతోంది. ఈ క్రమంలో షాహిద్ కపూర్ ప్రమోషన్స్‌లో భాగంగా అనేక విషయాల్ని పంచుకుంటూ ఉన్నాడు. ఈ సందర్భంలో తనను కొన్ని సందర్భాల్లో చాలా తక్కువ చేసి చూశారని, తాను అందరి కంటే తక్కువ అనే ఫీలింగ్‌ను తనలో కూడా కలిగించేలా చేశారని షాహిద్ కపూర్ చెప్పుకొచ్చాడు. ఇక షాహిద్ కపూర్ మాట్లాడిన ఈ మాటలతో జనాలు ఇదంతా కూడా పద్మావత్ సినిమా గురించే అని అంటున్నారు. ఆ టైంలో రణ్ వీర్ సింగ్, దీపిక పదుకొణెలే హైలెట్ అయ్యారని, అదంతా పీఆర్ మాఫియా అని.. షాహిద్ కపూర్‌కు రావాల్సిన పేరుని రానివ్వలేదని, ఆ చిత్రంలో అసలు షాహిద్ కపూర్‌కు కూడా గుర్తింపు ఇవ్వలేదని, రావాల్సిన ప్రశంసలు కూడా రానివ్వలేదు అంటూ నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. తాను అందరికంటే చాలా తక్కువ అనే భావాన్ని తనలోనూ కలిగేలా చేశారని, కానీ తాను తక్కువ కాదని తనకు తెలుసని షాహిద్ కపూర్ అన్నాడు. తానొక పోరాట యోధుడ్ని అని, ఇలాంటివి ఎన్నో దాటి ఇక్కడకు వచ్చానని, వీటిని కూడా ధాటేస్తాను అని తనకు తాను ధైర్యం చెప్పుకునే వాడ్ని అంటూ షాహిద్ కపూర్ తెలిపాడు. అయితే షాహిద్ కపూర్ మాటల మీద బాలీవుడ్ సర్కిళ్లోని ఓ క్రిటిక్ కేఆర్కే కాస్త ఘాటుగానే స్పందించాడు. నువ్వు, రణ్ వీర్ సింగ్ ఇద్దరూ కూడా ఫ్లాప్ యాక్టర్లే.. మీ ఇద్దరూ ఫ్లాపులే ఎక్కువగా ఇచ్చారు.. రణ్ వీర్ కంటే నువ్వే ఇంకా ఎక్కువ ఫ్లాపులు ఇచ్చావ్ అంటూ కౌంటర్లు వేశాడు. ఇతగాడు వేసిన ట్వీట్ మీద కూడా చర్చలు జరుగుతున్నాయి. కొందరు షాహిద్ కపూర్ బెస్ట్ యాక్టర్ అంటే.. ఇంకొందరు రణ్ వీర్ సింగ్ బెస్ట్ యాక్టర్ అని ట్వీట్లతో వాగ్వాదానికి దిగుతున్నారు.

# కెరీర్ కోసం కుటుంబాన్ని త్యాగం చేశా

రష్మిక తాజాగా బాలీవుడ్ మీడియాతో ముచ్చటించింది. ఛావా ప్రమోషన్స్‌లో భాగంగా రష్మిక అనేక విషయాల్ని పంచుకుంటోంది. విక్కీ కౌశల్, రష్మిక జంటగా ఛావా చిత్రం తెరకెక్కింది. ఈ మూవీ ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ కథ ఆధారంగా ఈ మూవీని తీశారు. ట్రైలర్ రిలీజ్ తరువాత మూవీ మీద అంచనాలు పెరిగాయి. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో రష్మిక చెప్పిన విషయాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. రష్మిక ప్రస్తుతం ఇండియాలో క్రేజీ, బిజీ ఆర్టిస్ట్‌గా మారిపోయింది. యానిమల్, పుష్ప 2 సక్సెస్‌లు రష్మికను బాలీవుడ్‌లో నిలబెట్టేశాయి. రష్మిక బాలీవుడ్ దర్శకులతో చేసిన సినిమాల కంటే సౌత్ డైరెక్టర్లతో చేసిన సినిమాలే ఎక్కువగా విజయాలు సాధించాయి. ఇక ఇప్పుడు విక్కీ కౌశల్ హీరోగా ఛావా అనే సినిమాను రష్మిక చేసింది. ఈ మూవీ ఫిబ్రవరి 14న రాబోతోంది. రీసెంట్‌గా ట్రైలర్ రిలీజ్ అవ్వడంతో సినిమా మీద అంచనాలు పెరిగాయి. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ కథ ఆధారంగా ఈ ఛావా చిత్రాన్ని తెరకెక్కించారు. రష్మిక ఈ చిత్రంలో ఏసుబాయి పాత్రలో కనిపించబోతోంది. తన లుక్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో రష్మిక ఫుల్ ఖుషీ అవుతోంది. ఇక రష్మిక బాలీవుడ్ మీడియాతో మాట్లాడుతూ తన ఫ్యామిలీని ఎంతగా మిస్ అవుతోందో చెప్పుకొచ్చింది. కెరీర్ కోసం కుటుంబాన్ని త్యాగం చేయాల్సి వస్తోందని రష్మిక బాధపడింది. ఒకటి కావాలంటే ఒకటి త్యాగం చేయాల్సి వస్తుందని.. యాక్టింగ్ కెరీర్‌లోకి వచ్చిన కొత్తలోనే తన తల్లి చెప్పిందట.

ఇక తన కెరీర్ కోసం కుటుంబాన్ని త్యాగం చేశానని, వారితో ఎక్కువగా సమయం గడపలేకపోతోన్నానని రష్మిక చెబుతూ బాధపడింది. తనకు తన చిట్టి చెల్లి అంటే ఎంతో ఇష్టమని, ప్రతీ రోజూ మెసెజ్‌లు చేసుకుంటామని చెప్పుకొచ్చింది. తన చెల్లి చాలా స్మార్ట్ అని చెబుతూ మురిసిపోయింది. గొప్ప వ్యక్తి, మహిళగా ఎదుగుతుందని తన చెల్లి గురించి రష్మిక చెప్పింది. ఇలా కంటిన్యూగా షూటింగ్స్ ఉండటంతో ఫ్యామిలీతో ఎక్కువ సమయాన్ని గడపలేకపోతోంటాను అని రష్మిక తన బిజీ లైఫ్ గురించి చెప్పింది. రష్మిక ప్రస్తుతం తెలుగులో ది గర్ల్ ఫ్రెండ్ అనే సినిమాను చేస్తోంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇక పుష్ప 2, యానిమల్ సక్సెస్‌లతో రష్మిక బ్రాండ్ వ్యాల్యూ బాగానే పెరిగింది. దీంతో ఇక తెలుగు మేకర్లకు అందనంత రేంజ్‌లో రెమ్యూనరేషన్ పెంచేలానే ఉంది. ఇక ఛావా సినిమ్మ కూడా బ్లాక్ బస్టర్ అయితే.. పూర్తిగా బాలీవుడ్‌లోనే పాగా వేసేలా ఉంది.



# జిమ్‌లో తేజ్ కష్టాలు చూశారా?

సాయి ధరమ్ తేజ్ ప్రస్తుతం నెట్టింట్లో తన బాడీతో అందరినీ భయపెట్టించేస్తున్నాడు. సంబరాల ఏటి గట్టు సినిమా కోసం తేజ్ తన బాడీని తెగ కష్టపెడుతున్నాడు. కెరీర్‌లో ఫస్ట్ టైం ఇలా హెవీ వర్కౌట్లు చేస్తూ భారీగా బాడీని పెంచేస్తున్నాడు. తేజ్ శరీరాకృతిని చూసి అంతా నోరెళ్లబెట్టేయాల్సిందే. తేజ్ ఇంతలా కష్టపడుతున్నాడంటే.. దాని అవుట్ పుట్ ఇంకెలా వస్తోందో అని ఫ్యాన్స్ ఎగ్జైట్ అవుతున్నారు.

సాయి ధరమ్ తేజ్ అలియాస్ సాయి దుర్గా తేజ్ ప్రస్తుతం జిమ్‌లో ఎంత కష్టపడుతున్నాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సంబరాల ఏటి గట్టు మూవీ కోసం తేజ్ బాడీని పెంచేస్తున్నాడు. ఇప్పటికే తేజ్ కండలు తిరిగిన దేహంతో కనిపిస్తున్నాడు. సంబరాల ఏటి గట్టు టైటిల్ గ్లింప్స్‌లో తేజ్ కనిపించిన తీరుకి అంతా షాక్ అయ్యారు. తేజ్‌ను తొలిసారిగా అలాంటి లుక్కులో, గెటప్పులో చూడటంతో ఆడియెన్స్‌తో పాటుగా, అభిమానులు సర్ ప్రైజ్‌గా ఫీల్ అయ్యారు. ప్రస్తుతం సంబరాల ఏటి గట్టు మూవీ షూటింగ్ జరుగుతోంది. ఈ షూట్‌తోనే తేజ్ ఫుల్ బిజీగా ఉన్నాడు. షూటింగ్ అయిపోయాక మళ్లీ జిమ్‌లో కసరత్తులు స్టార్ట్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. అటు షూటింగ్, ఇటు జిమ్ అంటూ తేజ్ తీరిక లేకుండా గడిపేస్తున్నాడు. తాజాగా తేజ్ జిమ్‌లో కష్టపడుతున్న ఫోటోని ట్రైనర్ పోస్ట్ చేశాడు. చూస్తుంటే తేజ్ ఇక నా వల్ల కాదురా బాబోయ్ అంటూ దండం పెట్టినట్టుగా కనిపిస్తోంది.



ఈ ఫోటోలో తేజ్ బాడీని చూస్తే అంతా నోరెళ్లబెట్టేయాల్సిందే. ఈ బాడీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసేలానే ఉన్నాడు. విరూపాక్ష తరువాత తేజ్ ఎంత సెలెక్టివ్‌గా మారిపోయాడో అందరికీ తెలిసిందే. ఆచితూచి ప్రాజెక్టుల్ని ఎంచుకుంటున్నాడు. నచ్చిన, మెచ్చిన కథల్నే సెలెక్ట్ చేసుకుంటున్నాడు. ఈ సంబరాల ఏటి గట్టు మూవీని ఈ ఏడాదే రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. రీసెంట్‌గా ఈ మూవీ సెట్స్ వద్దకు వచ్చిన అభిమానుల్ని ప్రేమగా పలకరించాడు.

దాదాపు 350కి పైగా మంది అభిమానులు వస్తే.. వారందరి కోసం స్పెషల్‌గా ఏర్పాట్లు చేశాడు. అందరికీ కడుపు నిండా భోజనం పెట్టించి, ఫోటోలు ఇప్పించి మరీ పంపించాడు. తేజ్ మంచి మనసును చూసి అంతా ప్రశంసలు కురిపించారు. సోషల్ మీడియాలో ఈ ఫ్యాన్ మీటింగ్‌కు సంబంధించిన వీడియోలు, ఫోటోలు బాగానే వైరల్ అయ్యాయి. ప్రస్తుతం తేజ్ అయితే తన సినిమా కోసం అహర్నిశలు కష్టపడుతున్నాడని ఈ జిమ్ ఫోటోలను చూస్తేనే అర్థం అవుతోంది.

# 'సిండికేట్'పై అవన్నీ రూమర్లే




రామ్ గోపాల్ వర్మ తాజాగా సిండికేట్ మీద వస్తున్న రూమర్లను ఖండించాడు. సిండికేట్ క్యాస్టింగ్ మీద సోషల్ మీడియాలో, మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై వర్మ స్పందించాడు. అవన్నీ అవాస్తవాలే అని, వాటిని నమ్మొద్దని, అసలు వివరాలను తానే త్వరలో ప్రకటిస్తాను అని వర్మ క్లారిటీ ఇచ్చాడు. మరి ఈ సిండికేట్ మీద వర్మ నిజంగానే సీరియస్‌గా ఉన్నాడా? లేదా? అన్నది ఇంకొన్ని రోజుల్లో తేలనుంది.

రామ్ గోపాల్ వర్మ తాజాగా సిండికేట్ సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇన్నేళ్లుగా తీస్తూ వచ్చిన పిచ్చి సినిమాలు, చేసిన పాపాలను సిండికేట్ మూవీతో కడిగేసుకుంటాను అన్న టైపులో వర్మ చెప్పేశాడు. సత్య రీ రిలీజ్ తరువాత వర్మకు ఈ బుద్ధి వచ్చినట్టుగా ఉంది. ఒకప్పుడు సత్య, రంగీలా, సర్కార్ అంటూ బాలీవుడ్‌ను షేక్ చేశాడు ఆర్జీవీ. రక్త చరిత్ర తరువాత వర్మ ఇంత వరకు తన మార్క్‌ను చూపించలేదు. మధ్యలో బూతు బొమ్మల మీదే వర్మ ఎక్కువగా ఫోకస్ పెట్టాడు. ఇన్నేళ్లు ఇండస్ట్రీ ఇచ్చిన అవకాశాల్ని దుర్వినియోగం చేసుకున్నానని, ఇక ఇప్పుడు తన సత్తాను చాటుకుంటాని వర్మ చెబుతున్నాడు.

ఈ క్రమంలోనే సిండికేట్ అనే సినిమాను వర్మ అనౌన్స్ చేశాడు. ఈ మూవీ కాన్సెప్ట్ కూడా వర్మ చెప్పాడు. ఒకప్పుడు స్మగ్లింగ్, డీ కంపెనీ అంటూ ఇలా మాఫియా ఉందని, ఇప్పుడు అలాంటివేమీ లేవని, క్రైమ్ సమసిపోదు.. రూపాంతరం చెందుతుందని, మనుషులే అతి క్రూరమైన జంతువులు అన్నట్టుగా ఓ లైన్‌ను అనుకున్నాడట. ఇక ఈ సిండికేట్ మూవీకి సంబంధించిన వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తానని వర్మ చెప్పాడు.

కానీ ఇంతలోనే సోషల్ మీడియాలో కొందరు రూమర్లు పుట్టించేశారు. వర్మకి క్లోజ్ అయిన వెంకటేష్, అమితాబ్ వంటి వారితోనే సిండికేట్ చేస్తాడని రూమర్లు క్రియేట్ చేశారు. వెంకీమామ, అమితాబ్, విజయ్ సేతుపతి వంటి వారితో సిండికేట్ మూవీని వర్మ ప్లాన్ చేస్తున్నాడంటూ ప్రచారాలు చేస్తూ వచ్చారు. ఈ రూమర్లు వర్మ వరకు చేరినట్టున్నాయి.

దీంతో వర్మ ఆ ప్రచారాల్ని కొట్టి పారేశాడు. అవన్నీ అవాస్తవాలే అని తేల్చి చెప్పేశాడు. ఇంకా ఫిక్స్ కాలేదని, అన్నీ పూర్తయితే తానే అధికారికంగా ప్రకటిస్తానని సోషల్ మీడియాలోని రూమర్లను నమ్మొద్దని వర్మ ట్వీట్ వేశాడు. నిజంగానే ఈ సిండికేట్ మూవీ పట్ల వర్మ సీరియస్‌గా ఉన్నాడా? మళ్లీ కమ్ బ్యాక్ ఇస్తాడా? అన్నది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. అంతలోపు వర్మ తీసిన శారీ మూవీ వస్తుందా? లేదా? అన్నది చూడాలి.